ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
బుధవారం, 4 సెప్టెంబరు 2024





- ఖమ్మం జిల్లాను అన్ని విధాలా ఆదుకుంటాం
- మున్నేరు రిటైనింగ్ వాల్స్ ఎత్తు పెంపుపై నిపుణులతో చర్చిస్తాం
- మాజీ మంత్రి పువ్వాడ ఆక్రమణలను హరీష్ రావు దగ్గరుండి తొలగిస్తారా?
- అక్రమ నిర్మాణాలపై హైడ్రా తరహాలో చర్యలు తీసుకుంటాం
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

వరద నష్టంపై పూర్తిస్థాయిలో సర్వే

వివరాలు : 7లో



- మోతీలాల్ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ
- కుమారుడికి గ్రూప్‌-1స్థాయి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ
- మృతులిద్దరికీ రూ.5లక్షల చొప్పున పరిహారం
- ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు
- తండ్రీకూతుళ్ల చిత్రపటాలకు నివాళి
- మోతీలాల్ సతీమణికి ఓదార్పు
- కారేపల్లి మండలం గంగారాం తండాకు రాక

7

అధైర్యపడకండి అండగా ఉంటా..

కన్నీటి వ్యథలు ఒకవైపు... సహాయక చర్యలు మరోవైపు...



- వరద విలయం నుంచి కోలుకుంటున్న ఖమ్మం నగరం
- ఇళ్ల నిండా బురదతో బాధితుల వెతలు
- శుభ్రం చేసుకునేందుకు అందుబాటులో లేని నీళ్లు
- సర్వం కోల్పోయి రోదిస్తున్న నిరుపేద కుటుంబాలు
- వరదపీడిత ప్రాంతాల్లో అధ్వానంగా మారిన పారిశుధ్యం
- ప్రభుత్వ సాయం కోసం బాధితుల వినతులు
- మంత్రులు తుమ్మల, పొంగులేటి పర్యటన
- నష్టంపై రెవెన్యూ సిబ్బంది సర్వే
- ఇంకా పునరావాస కేంద్రాల్లోనే జనం
- బంధువుల ఇళ్లకు తరలివెళ్లిన అనేకమంది బాధితులు



ఖమ్మం ఖానాపురం హవేలి/ఖమ్మం సంక్షేమ విభాగం/ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 3: ఒకవైపు వరద బాధితుల కన్నీళ్లు.. మరోవైపు అధికార యంత్రాంగం సహాయక చర్యలు.. ఇంకోవైపు నేతల పరామర్శలు.. ఖమ్మం నగరంలో మంగళవారం ఎటుచూసినా మున్నేరు సృష్టించిన వరద విలయం ప్రభావాలే కనిపించాయి. వరద తగ్గుముఖం పట్టడంతో బాధితులు క్రమంగా ఇళ్లు చేరుతుండగా, వరదతో ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనిలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది నిమగ్నమయ్యారు. మంత్రులు తుమ్మల, పొంగులేటి వరద పీడిత ప్రాంతాల్లో పర్యటించి బాధతులకు ధైర్యం చెప్పారు. అలాగే బీఆర్ఎస్ అగ్రనాయకులు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు ఓదార్పునిచ్చారు. ఇక మున్నేరు వరద ప్రాంతాల్లో జనం కష్టాలు మూడోరోజైన మంగళవారం కూడా కొనసాగాయి.


ఎక్స్‌కవేటర్‌తో చెత్త తొలగింపు

భారీ వర్షాలకు శనివారం రాత్రి ఖమ్మం నగరంలోని మున్నేరు పొంగి ప్రవహించటంతో రామన్నపేట కాలనీ, దానవాయిగూడెం, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప, వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ, మంచికంటి నగర్, మోతీనగర్, గాంధీనగర్, ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాలలో భారీ వరద ప్రవేశించి ఇళ్లను ముంచేసిన విషయం విదితమే. దీంతో వేలాదిమంది ప్రజలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఇంట్లోని వస్తువులన్నీ వరదపాలు కాగా, గదులన్నీ బురదమయం కావడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా వున్నాయి. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత వెళ్లిన జనం తమ ఇళ్లను చూసి భోరుమన్నారు. బురదమయమైన వస్తువులను శుభ్రం చేసుకునేందుకు నానాయాతన పడుతున్నారు. కనీసం తాగడానికి మంచినీళ్లు కూడా లేకపోవడంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో ఎన్నడూ ఎదుర్కొనని ఇబ్బందికర పరిస్థితులను మున్నేరు వరద బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్నాయి. గతేడాది కూడా మున్నేరుకు వరద పోటు వచ్చి వెంటనే తగ్గింది. వరద, వర్షం తర్వాత రోజు ఎండ రావటంతో బాధితులు తమ నివాసాలను శుభ్రం చేసుకొని ఇళ్లలోకి వెళ్లారు. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. మున్నేరు వరద తగ్గినా బాధిత కుటుంబాలు కుదుట పడటం లేదు. వరద ఉధృతి ఈసారి వేగంగా ఉండటంతో పాటుగా పరివాహక ప్రాంతాల్లోని ఇళ్ల లోపల నుంచి గోడలకు, భవనాల పైనా ఒండ్రు మట్టి చేరింది. వర్షం ఆగకపోవడంతో బాధితులు ఇళ్లను శుభ్రం చేసిన కొద్ది సేపటికి మళ్లీ గోడలు, భవనాలు, ఇళ్లపై ఉన్న మట్టి కారి ఇళ్లలో ఉండేందుకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో పునరావాస కేంద్రాల్లోనే మరో రెండు రోజులు పాటు ఉండేందుకు బాధితులు కోరుతున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఈ మేరకు పునరావాస కేంద్రాలను కొనసాగించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. చేశారు. కావాల్సిన మేరకు ఆహార, నివాస ఏర్పాట్లు చేపట్టారు.


మునిసిపల్ నీటిని పట్టుకుంటున్న బాధితులు


బాధితులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

తట్టా బుట్టా చేతబట్టుకొని బంధువుల ఇళ్లకు...

వరదల్లో కొంతమంది ఇళ్లు పూర్తిగా, మరికొంతమంది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. భారీగా ఆస్తి నష్టం జరిగింది. అధికారులు సహాయక, పునరావాస చర్యలు చేపట్టారు. భారీ వరదల కారణంగా వారు మానసికంగా, ఆర్థికంగా దెబ్బతిన్నారు. గత రెండు రోజుల నుంచి తమ ఇళ్లకు చేరుకుని ఇంట్లోకి చేరిన బురదను శుభ్రం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదుకుంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చినా వారిలో ఇంకా బాధ తొలగలేదు. అకాల వరదలతో ముంపు ప్రాంత ప్రజలు తట్టా, బుట్టా చేతబట్టుకొని తమ బంధువుల ఇళ్లకు తరలి వెళ్లారు. రెక్కాడితే గాని డొక్కాడని తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించుకుంటున్నారు. తినడానికి తిండి ఎలా అంటూ నిస్సహాయ స్థితిలో దీనంగా మదన పడుతన్న సంఘటనలు మనసులను కలచి వేస్తున్నాయి. ఏదేమైనా తమను త్వరగా ప్రభుత్వం ఆదుకోవాలని (మిగతా 6వ పేజీలో)

రంగంలోకి గౌతమ్, కర్ణన్

ఖమ్మం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నగరంలో అధికారులు పారిశుధ్యంపై దృష్టిసారించారు. ట్యాంకర్లు, ఫైరింజన్ల ద్వారా వీధులను శుభ్రం చేస్తున్నారు. బురదను తొలిగిస్తున్నారు. దుర్వాసన రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు వైద్యారోగ్య శాఖ కమిషనర్ రాష్ట్ర మునిసిపల్ శాఖ కమిషనర్లు ఆర్వీకర్ణన్, వీపీ గౌతమ్ ఖమ్మంలో మకాం వేసి పారిశుధ్య, వైద్యారోగ్యసేవలను పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేకంగా హెల్త్‌క్యాంపులు ఏర్పాటుచేసి అంటువ్యాధులు ప్రబలకుండా వరద బాధితులు అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వరంగల్ నుంచి 300 మంది..

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 11: వరంగల్ నగర పాలక సంస్థ నుంచి పారిశుధ్య కార్మికులు, పలుగు, పార, చీపిరి, తట్టా, బుట్టా తీసుకొని బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ బాట పట్టనున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంతో పాటుగా భారీ వర్షాలతో ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లు అతలాకుతలమైనాయి. మున్నేరు వరద సాధారణ స్థాయిలోకి చేరినా బాధితుల గోడు మాత్రం తీరలేదు. నివాసాలు, రహదారులు బురదమయంగా మారాయి. అయితే ఖమ్మం నగరంలో పర్యటిస్తు క్షేత్రస్థాయిలో ప్రజల బాగోగులు తెలుసుకుంటున్న పూర్వ కలెక్టర్, సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వరంగల్ నగర పాలక సంస్థలో పారిశుధ్య పనులు చేస్తున్న 300 కార్మికులను ఖమ్మం రావాలని ఆదేశాలిచ్చారు. వారితో పాటుగా నిత్యం వినియోగించే పరికరాలు, యంత్రాలు, సాధనాలు తీసుకరావాలని ఆదేశించారు. వరంగల్ నుంచి 300 కార్మికులు వస్తే కేఎంసీలో మరింతగా పారిశుధ్య పనులు వేగవంతం కానున్నాయి.

ముగ్గురు మంత్రుల పర్యవేక్షణ..

ఖమ్మం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వరద సహాయ కార్యక్రమాలను అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ నియోజకవర్గాల్లో మకాం వేసి సహాయ కార్యక్రమాలు వేగంవతం చేస్తున్నారు. బాధితులకు నిత్యావసరాలు, ఆహారపొట్లాల పంపిణీతో పాటు గ్రామపంచాయతీల నుంచి జిల్లా వ్యాప్తంగా ట్యాంకర్లు, సిబ్బందిని రప్పించి పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. వ్యవసాయం, ఆర్‌అండ్‌బీ, పీఆర్, వైద్యారోగ్యశాఖలు, ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ, ట్రాన్స్ కో విభాగాలు జరిగిన నష్టం అంచనా వేస్తున్నారు. విద్యుత్ పునరుద్ధరణకోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న లైన్‌మెన్లను రప్పించారు. దీంతో వరద సహాయ కార్యక్రమాల్లో అన్నిశాఖల అధికారులు నిమగ్నమయ్యారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు గ్రామాల్లో మంచినీటి సరఫరా పునరుద్ధరించారు.

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

- 9 మంది ఎమ్మెల్యేలున్నా 9 మందిని కాపాడలేక పోయారు
- వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మాపై కాంగ్రెస్ గుండాలు దాడిచేశారు
- ముగ్గురు మంత్రులే దాడి ఘటనకు బాధ్యత వహించాలి
- మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్


ఖమ్మంలో ముంపు ప్రాంతాలను సందర్శిస్తున్న బీఆర్ఎస్ అగ్రనేతలు

ఖమ్మం టౌన్, సెప్టెంబరు 3: వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలమైందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 9 మంది ఎమ్మెల్యేలు ఉన్నా మున్నేరు బ్రిడ్జిపై చిక్కుకున్న 9 మందిని కాపాడలేక పోయారని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. ఖమ్మంలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీష్‌రావు మాట్లాడుతూ భారీవర్షాలు కురుస్తాయని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకపోవటం వల్ల ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తీవ్రనష్టం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడలేక పోయిన ప్రభుత్వం ఎంత బాగా పనిచేస్తుందో తెలుస్తుందన్నారు. వరదముంపు ప్రాంతాల్లో కనీసం హెలీకాప్టర్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సైతం అందుబాటులోకి ఉంచలేకపోయిందన్నారు. ఆదివారం రాత్రి ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లోని మున్నేరు బ్రిడ్జిపైన చిక్కుకున్న 9 మందిని రక్షించడంలో ప్రభుత్వ యంత్రాంగం చేతులెత్తేయగా, ఒక ఎక్స్‌కవేటర్ డ్రైవర్ ప్రాణాలకు తెగించి వారిని కాపాడాడని తెలిపారు. (మిగతా 7వ పేజీలో)



శుభకార్యానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- గల్లంతైన బావ బామ్మర్దుల మృతి
- ఆళ్లపల్లి మండలం చింతకుంట సమీపంలో మృతదేహాల లభ్యం
- టేకులపల్లి మండలం లచ్చగూడెంలో విషాదం

6



శాంతించిన మున్నేరు

- 36 అడుగుల నుంచి 6 అడుగులకు తగ్గిన ప్రవాహం

ఖమ్మం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో శనివారం రాత్రి మహోగ్రరూపం దాల్చి 36 అడుగుల ఎత్తులో ప్రవహించి తీవ్ర విలయం సృష్టించిన మున్నేరు ఎట్టకేలకు శాంతించింది. మంగళవారం రాత్రి నది ప్రవాహం 6.25 అడుగుల ఎత్తులో కనిపించింది. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి 13.5 అడుగుల వరకు ఉండగా.. ఆ తర్వాత నుంచి తగ్గుతూ వచ్చింది. మంగళవారం ఉదయం 9 గంటలకు 13 అడుగులు ఉండగా, మధ్యాహ్నం 1.30కు 11.5 అడుగులకు చేరింది. రాత్రి 11 గంటల సమయానికి పూర్తిగా తగ్గిపోయి 6.25 అడుగులు మాత్రమే ప్రవహిస్తోంది. ప్రస్తుతం మున్నేరు నీటిమట్టం పూర్తిగా తగ్గిపోవడంతో అధికార యంత్రాంగం, ప్రజలు కొంతమేరకు ఊపిరిపీల్చుకున్నారు. మున్నేరు పొంగడంతో పరీవాహకం లోని అనేక ప్రాంతాలు వరద బారిన పడిన విషయం తెలిసిందే.

వైరింగ్ పరిశీలించిన తర్వాతనే గృహ విద్యుత్ వినియోగించాలి

- రేపటి వరకు పూర్తి స్థాయి విద్యుత్ పునరుద్దరణ
- విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్లు కిషన్, చౌహాన్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 3: వరదలతో నష్టపోయిన విద్యుత్ వ్యవస్థను రేపటి లోగా పునరుద్ధరణ చేయాలని విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజనీర్లు కిషన్, చౌహన్ ఆదేశించారు. మున్నేరు వరదల్లో ధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను చీఫ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించా రు. ఇంటింటికి వెళ్లి జరిగిన నష్టాలను అంచనాలు వేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సిబ్బందిని ఖమ్మానికి రప్పించి విద్యుత్ తిరిగి అందించే ఏర్పాట్లను పరిశీలించా రు. ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో నీళ్లలో నివాసాలు ఉండ టంతో వాటికి విద్యుత్ సరఫరా పంపిణీపై పరిశీలించి సూచనలు ఇచ్చారు. చీఫ్ ఇంజనీర్ కిషన్ మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో పరికరాల ఇబ్బంది లేదన్నారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలు విద్యుత్ మరమ్మతులు చేయిం


విద్యుత్ మర్మతులు పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ కిషన్, ఎస్ఈ సురేందర్

చుకున్న తర్వాతనే విద్యుత్ వినియోగించాలని స్విచ్ బోర్డులు, వైరింగ్‌లోకి నీరు చేరటం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎస్ఈ సురేందర్, డీఈలు రామారావు, బాబురావు, నాగేశ్వరరావు, భద్రపవర్, వీరాలాల్, ఏడీఈ సీహెచ్ సుధాకర్‌రావు, సతీష్, నాగార్జున, రమేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్యుడికి బెదిరింపు కాల్స్

- డబ్బులు ఇవ్వాలని డిమాండ్
- సెల్ఫీ వీడియోలో ఇబ్బందులను వెల్లడించిన డాక్టర్ వీడియో వైరల్
- సంఘీభావం తెలిపిన వ్యాపారులు, వైద్యులు
- పోలీసులకు ఫిర్యాదు
- ముగ్గురిపై కేసు నమోదు

మణుగూరు సెప్టెంబరు 3: మణుగూరులో ప్రముఖ ప్రైవేటు వైద్యుడు శశిధర్‌కు నాలుగు నెలలుగా కొందరు వ్యక్తులు కాల్స్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇంతకాలం భరిస్తూ వచ్చిన డాక్టర్ శశిధర్ చివరికి మంగళవారం సెల్ఫీ వీడియోలో తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులను కన్నీటి పర్యాంతం అవుతూ రిలీజ్ చేశాడు. తాను కష్టపడి పనిచేస్తూ డాక్టర్ వృత్తిలో వచ్చానని అయితే కొందరు వ్యక్తులు తనను నాలుగు నెలలుగా అనేక రకాలుగా బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ వీడియో పలు సోషల్ మీడియాలో వచ్చే సరికి వైరల్‌గా మారింది.


వైద్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు పరిసరాల ప్రజలకు మంచి సేవలం దించే గుండెకు సంబంధించి వైద్యుడు ఒక్కరే ఉండగా ఆయనపై ఇలా వేధింపులకు గురి చేయడం బ్లాక్ మెయిల్ చేయడమేమిటంటూ వైద్యులు, పట్టణ వ్యాపారులు మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు జరిగిన సంఘటన వీడియోపై స్పందించారు. పట్టణం వ్యాపారులంతా ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. అంతేకాకుండా మణుగూరు వైద్యులు పట్టణ వ్యాపారులు అంతా ప్రదర్శనగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. జరిగిన విషయాన్ని డాక్టర్ శశిధర్ డీఎస్పీ రవీంధర్‌కి తెలిపారు. పలువురు వైద్యులు కూడా గత సందర్భాలను తెలిపారు. ఈ విషయంపై డీఎస్పీ మాట్లాడుతూ. డాక్టర్ శశిధర్ ఇలాంటి విషయంలో ముందడుగు వేసి బయటికి రావడం అభినందనీయమన్నారు. వేధింపులకు గురి చేస్తూ బ్లాక్ మెయిల్ చేసే వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైద్యులు మంగళవారం డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మణుగూరు పట్టణం అంతా బంద్ పాటించి డాక్టర్ శశిధర్‌కు మద్దతుగా నిలిచింది.

డాక్టర్ శశిధర్ ను వేధించిన ముగ్గురిపై కేసు

మణుగూరు పట్టణ ప్రముఖ వైద్యుడు సాయి మమత ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ శశిధర్‌ను, అతని కుటుంబసభ్యులను నాలుగు నెలలుగా వేధింపులకు గురి చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న వారిపై మంగవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయింది. దీంతో మణుగూరు సీఐ డాక్టర్ శశిధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదు ఆదారంగా మొత్తం ముగ్గురు వ్యక్తలు బ్లాక్ మెయిల్ చేస్తూ వేధింపులకు గురి చేసినట్లు తెలిపారు. వీరిపై విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కన్నీటి వ్యథలు ఒకవైపు...

సహాయక చర్యలు మరోవైపు

(5వ పేజీ తరువాయి)

వేడుకొంటున్నారు.

కాగా బురదమయమైన ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు నీళ్ల అందుబాటులో లేకపోవటంతో కార్పొరేషన్ అధికారులు వాటర్ ట్యాంకులతో నీటిని అందిస్తున్నారు. సుమారు 250 ఇళ్లలో కరెంటు మీటర్లు వరదలకు మునిగిపోవటంతో విద్యుత్ అధికారులు కొత్త మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. దానాయిగుడెం కాలనీలో డిగ్రీ చదివిన విద్యార్థుల సర్టిఫికెట్లు వరదనీటిలో తడిసి ఎందుకు పనికిరాకుండా పోయాయని పలువురు విద్యార్థులు వాపోయారు. ఒక్కో ఇంటిలో టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, ఫ్యాన్లు, మంచాలు, పరుపులు వంట సామగ్రి, బియ్యం వరదనీటిలో తడిసి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఒక్కో ఇంటికి లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఆర్థిక నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. దానయాయిగుడెం, రామన్నపేట కాలనీలో సుమారు 20 ఇళ్లు పూర్తిగా, 50 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒకవైపు వ్యర్థాలు, మరోవైపు బురద పేరకుపోవడంతో వరద పీడిత కాలనీలన్నీ కంపు కొడుతున్నాయి. వరదలో కొట్టుకువచ్చిన వస్తువులు ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. కేఎంసీ సిబ్బంది ట్రాక్టర్లు, జేసీబీలతో తొలగిస్తున్నప్పటికీ అవి ఏ మూలకూ సరిపోవడం లేదు.

మరోవైపు రెవెన్యూశాఖలె అసిస్టెంట్ కలెక్టర్ నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు కేఎంసీలో ఇంటింటి సర్వే చేపట్టారు. బాధితుల నష్టాన్ని అంచనాలు వేస్తున్నారు. వీరికి ప్రత్యేక అధికారిని నియామకం చేశారు. రెవెన్యూ సిబ్బంది సమగ్ర సర్వే చేస్తుండగా ఇతరశాఖల అధికారులు, ఉద్యోగులు వారికి కేటాయించిన పారిశుద్య, తాగునీరు, సేవా కార్యక్రమాలు చేపట్టారు.

కట్టుబట్టలే మిగిలాయి....

ఎస్‌కే జమాల్‌బీ, దానాయాయిగుడెం



భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలకు ఇళ్లన్నీ మునిగి కట్టుబట్టలే మిగిలాయి. నా ఇల్లు పూర్తిగా వరదల్లో మునిగిపోయింది. ఇంట్లోఉన్న బియ్యం, పప్పులు ఉప్పులు పూర్తిగా తడిసి పనికిరాకుండా పోయాయి. గ్యాస్ పోయి గ్యాస్ బండా కొట్టుకుపోయాయి. వండుకునేందుకు ఏమిలేవు. ఉన్న బియ్యం మొత్తం నీళ్లలో తడిసి ముక్కవాసన వస్తున్నాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఆదుకోవాలి.

సర్వం కోల్పోయాం..

మోదాంబీ, రామన్నపేట



వరదల కారణంగా సర్వం కోల్పోయి రోడ్డుమీద పడ్డాం. రెండు రోజులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతిగృహంలో ఉండి మంగళవారం ఇళ్లకు చేరుకున్నాం. ఇంటిలోని సామగ్రి అంతా బురదతతో నిండి పోయింది. ఒక్క వస్తువూ పనికిరాదు. ఆర్థికంగా నష్టపోయాం. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలి.

ఖమ్మం డీసీసీబీలో ఆరోపణలపై విచారణ

● సీఈవోను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు

ఖమ్మం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో వచ్చిన పలు ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ విచారణ నిర్వహించి సీఈవో అబీద్ ఉర్ రహమాన్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. డీసీసీబీలో బోర్డు సభ్యుల ఫిర్యాదుతో పాటు వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టెస్కాబ్ అధికాఇరులను విచారణకు ఆదేశించగా కోఆపరేటివ్ రిజిస్ట్రార్ విచారణ నిర్వహించారు. ఇటీవల బోర్డు సమావేశంలో ఖమ్మం డీసీసీబీలో రూ.78లక్షలు పాత బకాయిల పేరుతో సిబ్బందికి చెల్లింపులు చేశారని, సహకారసంఘాల సభ్యులకు బీమా నిమిత్తం ప్రభుత్వం రంగ బీమా కాకుండా ఎక్కువ ప్రీమియంతో సుమారు రూ.7.60కోట్లు ఖర్చుతో బీమా కింద చెల్లించారని సహకారసంఘాల నుంచి డీసీసీబీ నుంచి అనుమతి లేకుండా ఈప్రీమియం చెల్లించారని, రైతురుణమాఫీలో అర్హులున్న వారి పేర్లను అనర్హులులో చేర్చారని, రుణమాఫీలో అర్హులపేర్లు తొలిగించారని ఆరోపణలు వచ్చాయి. ఇటీవల జరిగిన డీసీసీబీ సబ్ కమిటీ సమావేశాల్లో కూడా డైరెక్టర్లు దీనిపై ప్రశ్నించారు. డీసీసీబీలో చోటుచేసుకున్న వ్యవహారాన్ని మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లడంతో ఖమ్మం డీసీసీబీలో వాస్తవ పరిస్థితి ఏం జరిగిందో తెలుసుకుని నివేదిక ఇవ్వాలని టెస్కాబ్ ఎండీతో పాటు డైరెక్టర్‌ను మంత్రి తుమ్మల విచారణకు ఆదేశించారు. ఈనేపథ్యంలో విచారణ నిర్వహించడంతో బ్యాంకు సీఈవోను సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ ఉదయ్‌కుమార్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం కోఆపరేటివ్ రిజిస్ట్రార్‌కుబాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు.

భారీగా దెబ్బతిన్న పంటలు

- మున్నేరు పరీవాహక ప్రాంతంలోనే అధిక నష్టం
- పూర్తిస్థాయి అంచనాలు వేయిస్తున్నాం
- ఎకరానికి రూ.10వేల పరిహారం అందిస్తాం
- ఖమ్మంలో వరద బాధితులను అన్ని విధాల ఆదుకుంటున్నాం
- దాడుల సంస్కృతి నా రాజకీయ చరిత్రలో లేదు..
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వందేళ్లలో ఎన్నడు లేని విధంగా 42 నుంచి 46 సెంమీ. వర్షపాతం మున్నేరు పరివాహక ప్రాంతంలో కురవడంతో ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీగా పంటల నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

మున్నేరు ప్రవాహంతోపాటు వరదతో ఖమ్మంజిల్లాలో 68,345, సూర్యాపేట జిల్లాలో 34,149, మహబాద్ జిల్లాలో 25,275, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో 2వేలపైగా ఎకరాల్లో పంట నష్టం జరగ్గా నారాయణపేట జిల్లాలో 6వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని,మూడురోజులుగా నీటిలో పంట ఉండడంతో కొన్ని పూర్తిగా దెబ్బతిన్నాయని, మరికొన్ని ఇసుకమేటలు వేశాయని, తెగుళ్లు కూడా సోకే ప్రమాదం ఉందని, వరద తగ్గినతర్వాత పంటలు రక్షించే దుకు రైతులుక అవసరమైన సలహాలు,సూచనలు చివ్వాలని అదికారులు, శాస్త్రవేత్తలకు సూచించామన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్తాయిలో పరిశీలించి రైతువారీగా పంటలు సర్వేచేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు.

వరద ప్రాంతల్లో పంటలు కోల్పోయిన రైతులకు కొత్తపంట వేసుకునేందుకు వీలుగా విత్తనాలు, ఎరువులు సత్వరం అందించేలా ప్రభుత్వం చర్యల తీసుకుంటుందని ఇప్పటికే ఆయా జిల్లాల్లో కొన్ని విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. వరి విత్తనాలు 3లక్షల క్వింటాళ్లు, మొక్కజొన్న3లక్షలు క్వింటాళ్లు వేరుశనగ 23వేలు క్వింటాళ్లు, పొద్దుతిరుగుడు 461 క్వింటాళ్లు సీడ్స్ కార్పొరేషన్ ద్వారా అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులకు జరిగిన పంట నష్టంపైప్రభుత్వ నివేదికలు రాగానే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.10 వేలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రాష్ట్రంలో గోదావరి, కృష్ణాకు వచ్చిన అతిపెద్ద వరదలను కూడా తాను చూశానని, ఇప్పుడు మున్నేరుకు వచ్చిన వరదను చూశానని, అన్ని సందర్భాల్లో ప్రజల ప్రాణాలుకాపాడే విషయంలో మంత్రిగా అనుభవం ఉందని, కొందరు ఇప్పుడు విమర్శలు చేయడం తగదన్నారు. ఆకస్మికంగా వాన, వరద వస్తే అప్పటికప్పుడు ఎవరు వైఫల్యం ఉండదని, ప్రకృతి సృష్టించిన బీభత్సానికి అనుగు ణంగా సహాయ కార్యక్రమాలు చేపట్టడమే ముఖ్యమన్నారు. వరద రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు.

వరద బాదితులను ఆదుకుంటున్నాం...

ఖమ్మం పట్టణంతో పాటు జిల్లాలో వరద బాదితులను ఆదుకునేదుకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంని యుద్ధప్రాపతిదన సహాయ చర్యలు చేపట్టామని తుమ్మల తెలిపారు ఖమ్మం నగరానికి గతంలో ఎన్నడూ లేని విధంగా వరదనీరు పోటేయడంతో వేల ఇళ్లు జలమయం అయ్యాయని, ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టినందున సహాయ చర్యలు ముమ్మరం చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లో భోజన, వసతి సౌకర్యాలుకలిపించామన్నారు. వరద వచ్చిన పది డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమం చేపట్టామని త్వరగా పూర్తి కాబోతునిదని తెలిపారు జిల్లాలోని 100 ట్యాంకర్లు, ఫైరింజన్లు ద్వారా శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు.

ప్రతి డివిజన్‌లోను బురద పేరుకుపోవడంతో దుర్వాసన వస్తుందని 197 స్థంబాలు, రెండు సబ్‌స్టేషన్లు ఖమ్మంలో దెబ్బతిన్నాయని, వరద కాలనరీల్లో విద్యుత్ పునరుద్దరణ, సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి 10కేజీల బియ్యం, వంటసామాగ్రి, భోజన ప్యాకెట్లు అందిస్తున్నా మని, టెస్కాబ్ ద్వారా దుస్తులు, దోతీలు ,అందిం చబోతున్నామని తెలిపారు. పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశామని, పది వైద్యబృం దాలు ఏర్పాటుచేసి ఇంటింటికి సర్వే చేపట్టడం జరిగిం దన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని, ఇల్లు పడిపోయని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. మున్నేరు రిటేనింగ్ వాల్ నిర్మాణంలో నిపుణుల కమిటీదే అంతిమ నిర్ణయమని తెలిపారు.

దాడుల సంస్కృతి నా రాజకీయ చరిత్రలో లేదు..

ఖమ్మం నగరంలో జరిగిన గొడవలో తన ప్రమేయం ఉందని బీఆర్‌ఎస్ మాజీమంత్రులు విమర్శించడం తగదని, దాడులు చేయించే చరిత్ర తన రాజకీయ జీవితంలో లేదని తుమ్మల పేర్కొన్నారు. స్థానిక కార్యకర్తల మధ్య జరిగిన గొడవను రాజకీయం చేయడం తగదన్నారు. దాడులు ఎవరు ప్రేరేపించినా అది సరైంది కాదని, వరద బాదిత సహాయ కార్యక్రమాల్లో రాజకీయ వివాదాలు మంచిది కాదని, ఈరాజకీయవల్ల వరద సహాయ చర్యలుక అవరోధం ఏర్పడుతుందన్నారు. ఈవిలేకరుల సమావేశంలో గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్ల నీరజ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మావోయిస్టు దళ సభ్యుడి లొంగుబాటు

- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పిలుపు

కొత్తగూడెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీ చర్ల ప్లాటూన్ ఏరియా కమిటీ సభ్యుడిగా పని చేస్తున్న మడకం అయితాల్ అలియాస్ అయిత భద్రాద్రి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట మంగళవారం లొంగిపోయారు. ఎస్పీ మాట్లాడుతూ చర్ల మండలం కోరకట్టుపాడు గ్రామానికి చెందిన మడకం అయితాల్ 2017లో మావోయిస్టు పార్టీలో మిలిషియా సభ్యుడిగా చేరి ఆ పార్టీ కమాండర్ సోడి జోగయ్యతో కలిసి 2020వరకు పని చేశారు. జోగయ్య మృతి అనంతరం ఇతను దళసభ్యుడిగా పదోన్నతి పొంది చర్ల ప్లాటూన్‌లో పదోన్నతి పొంది ఆ ప్లాటూన్‌లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఇతనిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.4లక్షల రివార్డు ఉందన్నారు. జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ చేయూత' ద్వార కౌన్సిలింగ్ కార్యక్రమానికి హజరైన కుటుంబ సభ్యులు మడకం అయితాల్‌ను కుటుంబసభ్యులు బయటకు తీసుకొచ్చి లొంగుబాటుకు ప్రయత్నించారు. దీనిలో భాగంగానే మెరుగైన వైద్యం పొంది జనజీవనం స్రవంతిలో కలిసి సాధారణ జీవితం కలపాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇప్పటికైన లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనే మావోయిస్టు దళసభ్యులు, దళంలో పని చేస్తున్న ఎవరైనా వారి కుటుంబసభ్యులుతో కానీ వారి దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

ఉత్తమ శాస్త్రవేత్త, ఉత్తమ రైతు అవార్డుల ప్రదానం


అవార్డులతో రవికుమార్, రాణాప్రతాప్, రామారావు

వైరా, సెప్టెంబరు 3: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పదోవ వ్యవస్థాపక దినోత్సవ సంబరాల్లో మంగళవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రో గ్రాం కోఆర్డినేటర్‌కు బెస్ట్ సైంటిస్టు, జిల్లాకు చెందిన ఇద్దరు రైతులకు ఉత్తమ అవార్డులను ప్రదానం చేశారు. ప్రతి సంవత్సరం వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం నాడు వివిధ రంగాల్లో ముఖ్యంగా బోధనా, పరిశోధన, విస్తరణలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారిని గుర్తించి పురస్కారాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్‌కు ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. అలాగే వైరా మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన తుమ్మల రాణాప్రతాప్‌కు మెట్ట సేద్యంలో ఉత్తమ రైతు అవార్డును, రఘునాథపాలెం మండలం కోయచిలక గ్రామానికి చెందిన సీహెచ్.రామారావుకు ఉత్తమ రైతు అవార్డును ప్రదానం చేశారు. విశ్వవి ద్యాలయం ఉపకులపతి పి.రఘురామిరెడ్డి. సెంట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి బీజే.రావు ఈ అవార్డులను ప్రదానం చేశారు.

శుభకార్యానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- గల్లంతైన బావ బామ్మర్దులు మృతి

ఆళ్లపల్లి/టేకులపల్లి, సెప్టెంబరు 3: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షాలతో ఆదివారం రాత్రి ఆళ్లపల్లి మండలలోని కిన్నెరసాని వాగులో గల్లంతైన ఇద్దర వ్యక్తుల మృతదేహాలు మంగళవారం లభించాయి. టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన బావ, బామ్మర్దులు కోరం వెంకటేశ్వర్లు(29), దొడ్డా సాయికుమార్(23)లు ఆళ్లపల్లి మండలంలోని రాయపాడు-టేకులపల్లి మండలంలోని మొట్లగూడెం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగులో ఆదివారం రాత్రి గల్లంతయ్యారు. సాయికుమార్ అక్క స్వప్న కుమారుడి పుట్టువెంట్రుకల వేడుకకు గుండాల మండలంలోని వేపలగడ్డ గ్రామంలోని సమ్మక్క గద్దెల వద్దకు ఆదివారం ఉదయం వెంకటేశ్వర్లు, సాయికుమార్‌లు బైక్‌పై వెళ్లి అదేరోజు రాత్రి తిరిగి వస్తూ కిన్నెరసాని వాగులో పడిపోయారు. వేడుకకు వెళ్లిన మిగతా కుటుంబ సభ్యులు గ్రామానికి చేరుకున్నా వెంకటేశ్వర్లు, సాయికుమార్‌లు ఇంటికి రాకపోవడంతో బంధువులు ఆరాతీశారు. కానీ వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వారు వాగులో గల్లంతైనట్లు భావించిన పోలీసులు స్థానికుల సహకారంతో గాలించారు. ఈ క్రమంలో వారి మృతదేహాలు లక్ష్మీదేవిపల్లి మండలం చింతకుంట సమీపంలో ఊరగుట్ట దగ్గర స్థానికులు గుర్తించారు. లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలు కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు వేడుకొంటున్నారు.

కాగా, మృతుల్లో ఒకరైన కోరం వెంకటేశ్వర్లుకు భార్య సౌజన్య, ఏడాదిన్నర కుమార్తె భానుశ్రీ వున్నారు. మరో మృతుడు సాయికుమార్‌కు సుహాసినితో గత ఏడాది వివాహం అయింది. ఆమె ఇప్పుడు 8 నెలల గర్భిణి. సాయికుమార్ అక్క సౌజన్యను వెంకటేశ్వర్లు మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. సాయికుమార్ మరో సోదరి స్వప్న కుమారుడి పుట్టు వెంట్రుకల వేడుకకు వెళ్లి మోటారుసైకిల్‌పై వస్తుండగా జరిగిన ఈ ఘటనలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతితో లచ్చగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వరద ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్


బాదితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 3: మున్నేరు వరద ముంపు ప్రాంతాలను మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. బొక్కలగడ్డ, మంచికంటినగర్, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, వినాయకఘాట్, ప్రకాశ్‌నగర్, బతుకమ్మఘాట్‌లో ఇంటింటికీ తిరిగుతూ వరద బాదితులతో మాట్లాడి వారికి ధైర్యం కల్పించారు. వరద బాదితులు అధైర్య పడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముంపు ప్రాంత ప్రజలకు, నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు తక్షణమే పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పైనుంచి వచ్చే వరదను అంచనా వేయాలని, ప్రజలకు వెన్నుదన్నుగా నిలవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్,పలువురు అధికారులు ఉన్నారు.

నేటి నుంచి మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 3: అధిక వర్షాల కారణంగా నగరంలో ఏర్పడిన వరద ముంపు ప్రాంతాలలో కార్మికులు, దడవాయిలు, వ్యాపారులు ఉన్నందున నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం నుంచి ఈనెల 8 వరకు వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు సెలవులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 9 సోమవారం నుంచి క్రయవిక్రయాలు యధావిధిగా ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవులు విషయాన్ని గ్రహించాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్


స్థానికులతో మాట్లాడుతున్న హెల్త్ కమిషనర్ కర్ణన్

ఖమ్మం మార్కెట్ సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ. కర్ణన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, నగర కార్పొరేషన్ కమిష నర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి ఆయన నగరం లోని మంచికంటినగర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి బాధితులను పరామర్శించా రు. నష్టాన్ని చూసిన ఆయన వారికి ఏమేం కావాలో అడిగి తెలుసుకున్నారు. మొబైల్ హెల్త్ బృందానలను ఏర్పాటు చేశామని వారు ఇంటింటికి తిరిగి ఆరోగ్య సంబంధిత సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. మొబైల్ బృందాల పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా ప్రధాన ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. వరదల కారణంగా వ్యాధుల బారిన పడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. వైద్యాధికారులు నిరంతరం అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ రాంబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వాసుత్రిలో కర్ణన్ సమీక్ష నిర్వహించారు. పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలపై సూచనలు చేశారు.

వరద ముంపు బాధితులకు భట్టి భరోసా

- వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశం
- పంటనష్టం అంచనాలు తయారుచేసి పరిహారం ఇస్తామని అన్నదాతలకు హామీ

ముదిగొండ, సెప్టెంబరు 3: వరద ముంపు బాధితులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బాధితులకు భరోసా కల్పించారు. మంగళవారం ముదిగొండ మండలంలోని న్యూలక్ష్మీపురం, పండ్రేగుపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. న్యూలక్ష్మీపురం ఎస్సీకాలనీలో ఇళ్లలోకి వర్షపునీరు వచ్చిన ఇళ్లను పరిశీలించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం పండ్రేగుపల్లి గ్రామంలో మున్నేరు కరకట్ట తెగి ఇళ్లలోకి నీరు వచ్చిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. గ్రామానికి చెందిన వజీద్‌పాషా రేకుల ఇంటిని పరిశీలించి వారి కుటుంబానికి మనోధైర్యం చెప్పారు. కరకట్ట తెగిపోవడం వల్ల నీటమునిగిన పంటపొలాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రాథమికంగా పంట నష్టం అంచనాలు తయారుచేసి నివేదిక పంపించాలని అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంత నిరాశ్రయులకు తక్షణమే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డిని ఆదేశించారు. వరద ముంపు వల్ల ఇళ్లలోకి నీరు చేరడంతో తడిసిన సామగ్రిని పరిశీలించారు. ముంపు రాకుండా శాశ్విత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేశారు. తమకు రైతు రుణమాఫీ రాలేదని కొంతమంది రైతులు భట్టి దృష్టికి తీసుకువెళ్లగా వ్యవసాయ అధికారిని పిలిచి తక్షణమే వీరి వివరాలు నమోదు చేసుకొని రుణమాఫీ వర్తించకపోవడానికి గల కారణాలను పరిశీలించాలని సూచించారు. రైతులు అధైర్యపడొద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరుగుతుందన్నారు. ఖమ్మం రూరల్ ప్రాంతంలో తెగిపోయిన ఖమ్మం-కూసుమంచి 132కేవీ విద్యుత్ లైన్ హైటెన్షన్‌ను పరిశీలించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఏడీ బాబూనాయక్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రం, నాయకులు అజ్జర్, కందిమళ్ల వీరబాబు, వనం ప్రదీప్త, రవీందర్‌రెడ్డి, పసుపులేటి వెంకట్, ఉసికల రమేష్, కన్నయ్య పాల్గొన్నారు.


ముంపు బాధితులతో మాట్లాడుతున్న భట్టి

నేతల పరామర్శల వెల్లువ

ఖమ్మం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వరద ప్రాంతాలకు రాజకీయ నాయకులు,ప్రజాప్రతినిధుల పరామర్శల వెల్లువ సాగుతోంది.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటించి వెళ్లగా మంగళవారం బీఆర్‌ఎస్ మాజీమంత్రులు హరీష్‌రావు, పువ్వాడఅజయ్‌కుమార్, జగదీశ్వరెడ్డి, సబితా ఇంద్రారెడ్డి,ఎమ్మెల్యేల బృందం సందర్శించి వరద బాదితులకు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బాధితులకు సహాయం కింద నిత్యావసరాలు,కూరగాయలు అందించడంలో అక్కడక్కడా పోటీ నెలకొంది. స్వచ్ఛంద సంస్థలుకూడా సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి.

వరద బాధితులకు నేటి నుంచి నిత్యావసరాలు

● మంత్రి తుమ్మల వెల్లడి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 3: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో మున్నేరుతో పాటుగా భారీ వర్షాలతో నష్టపోయిన వరద బాధితులకు బుధవారం నుంచి నిత్యావసరాలు, దుప్పట్లు అందించబోతున్నారు. ఇందుకోసం మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్యతో సమీక్షించారు. వరద సహాయక చర్యలపై చర్చించారు. డివిజన్ల వారీగా సర్వే, బాధితుల గుర్తింపు, ఆస్తి నష్టం అంచనాల తీరుపై వివరాలను తెలుసుకున్నారు. ఎంత త్వరగా సర్వే పూర్తి జరిగితే ప్రభుత్వం అంత త్వరగా బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వటానికి సిద్దంగా ఉందని తెలిపారు.

బుధవారం నుంచి ఖమ్మం నగర పాలక సంస్థలో నిత్యావసరాలు, దుప్పట్లుతో పాటు పాల ప్యాకెట్లు పంపిణీ చేయాలని, పంపిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తుమ్మల అధికారులకు మార్గదర్శకం చేశారు. అవసరమైతే అదనపు శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి బురదను తొలగించాలన్నారు. వరద బాధితులకు భోజనం, తాగునీరు అందించటంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. అనంతరం కేఎంసీలో ఏర్పాటు చేసిన వరద ముంపు హెల్ప్‌లైన్ సెంటర్‌ను మంత్రి తుమ్మల పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

అండగా మేమున్నాం.. భయపడాల్సిన పనిలేదు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 3: అండగా మేమున్నాం.. మీరు భయపడాల్సిన పని లేదంటూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు వరద బాధితులకు భరోసా కల్పించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డ, మోతినగర్, చెర్వుబజార్, ఇతర ప్రాంతాల్లో మంత్రి తుమ్మల విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇదే ప్రాంతంలో పర్యవేక్షణ చేస్తున్న పూర్వ కలెక్టర్, సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్యతో మంత్రి మాట్లాడారు. పారిశుధ్య పనుల తీరు, ప్రజలకు తాగునీరు, నిత్యవసరాలు పంపిణీ, పునరావాస కేంద్రాల నిర్వాహణపై పలు ఆదేశాలిచ్చారు. కార్పొరేటర్ కమర్తపు మురళీ, సాధు రమేశ్‌రెడ్డి తదితరులున్నారు.

30వేల నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకుల సంచులను డివిజన్లకు పంపిణీ చేయిస్తున్న డీఆర్డీవో సన్యాసయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 3: ఖమ్మం నగరంలో మున్నేరు వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనలతో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు కీలకంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేసే బాధ్యతలను డీఆర్డీవో సన్యాసయ్యకు కలెక్టర్ అప్పగించారు. దీంతో గత రెండు రోజులుగా డీఆర్డీఏ మహిళా ఉద్యోగులు నిత్యావసరాలను ప్యాకింగ్ చేస్తుండగా, పురుష ఉద్యోగులు ప్యాకింగ్ చేసిన సరుకులను డివిజన్ల వారీగా పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ఒక్కో నిత్యావసరాల ప్యాకెట్‌లో 5కేజీల బియ్యం, కేజీ పప్పు, అయిల్ ప్యాకెట్, పావు కేజీ కారం, పసుపు ప్యాకెట్, ప్యాకెట్ ఉప్పు, కేజీ ఉల్లిగడ్డలు, పావు కేజీ చింతపండు మొత్తం ఒక ప్యాకెట్‌లో ఏర్పాటు చేసి పంపిణీ చేస్తున్నారు. ఇలా మంగళవారం వరకు 30వేల ప్యాకెట్లను తయారు చేసి పంపిణీ చేపట్టారు.

వరంగల్ డీఆర్‌ఎఫ్ బృందం సేవలు భేష్

▸ మున్నేరు వరదల్లో విశేష సేవలు అందించిన బృందం



వరంగల్ నుంచి వచ్చిన డీఆర్‌ఎఫ్ బృందం

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 3: సహాయం అందించేందుకు ప్రాంతాలతో సంబంధం లేదని విశేష సేవలను అందించారు వరంగల్ డీఆర్‌ఎఫ్ బృందం. మున్నేరుకు ఉధృతంగా వరద రావడంతో ఖమ్మం నగరంలోని పరివాహక ప్రాంతాల్లో బాధితులను మైదాన ప్రాంతాలకు తరలించడంలో వరంగల్ డీఆర్‌ఎఫ్ బృందం వెంకన్న, సాయికుమార్, శంకర్, సర్వేశ్, చంద్రకాంత్ రెండు రోజులు పాటు సేవలు అందించారు. వరదలు తగ్గడంతో తిరిగి వరంగల్‌కు వెళ్లారు. సేవలు అందించిన డీఆర్‌ఎఫ్ బృందాన్ని కమిషనర్ అభిషేక్ అగస్త్య అభినందించారు.

విద్యార్థులు భయం వీడి పాఠశాలకు రావాలి

● ఏఎంవో రవికుమార్

కొణిజర్ల, సెప్టెంబరు3: విద్యార్థులు భయం వీడిపాఠశాలకు రావాలని ఏఎంవో రవికుమార్ అన్నారు. కొణిజర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లోని గదులకు విద్యుత్ ప్రసారం కావడంతో విద్యార్థులు భయాందోళనతో పాఠశాలను వీడి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎంవో మంగళవారం పాఠశాలను తనిఖీ చేశారు. గదులను, గోడలను, విద్యుత్ బోర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ పాఠశాలలోని గోడలకు విద్యుత్ రాకుండా మరమ్మతులు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఎటువంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్యాంసన్ పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

కూసుమంచి, సెప్టెంబరు 3: పాలేరు వరదల్లో గల్లంతైన నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ సైదాబీ మృతదేహం జక్కేపల్లి సమీపంలో లభ్యమైంది. గ్రామానికి చెందిన షేక్ యాకుబ్ కుటుంబం ఇటీవల పాలేరు వరదల్లో గల్లంతైన సంగతి తెలిసిందే. ఈక్రమంలో కుమారుడు షరీఫ్‌ను పోలీసులు రక్షించారు. కాగా యాకుబ్ మృతదేహం సోమవారం చెట్లపొదల్లో చిక్కుకుని ఉండగా లభ్యమైంది. అనంతరం సైదాబీ మృతదేహాన్ని జక్కేపల్లి సమీపంలో గుర్తించిన పోలీసులు వెలికితీసి, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు.

వరద బురదకు జారి పడి భార్యభర్తలకు గాయాలు

▸ ఖమ్మం నగరంలో ఘటన

ఖమ్మం క్రైం, సెప్టెంబరు3: వరద బురదకు జారీ పడి భార్యభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని ధంసలాపురం సమీపంలో వరద ఎక్కువగా రావడంతో రెండురోజులుగా రాకపోకలు నిలిపివేశారు. తిరిగి సోమవారం నుంచి వాహనాలు వెళ్లేందుకు వీలు కల్పించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి. దీంతో చింతకాని మండలం రామకృష్ణపురం గ్రామానికి చెందిన భార్యభర్తలు గుర్రం నాగేశ్వరరావు, వసంత లు ద్విచక్రవాహనం పై ఖమ్మం వస్తుండగా ధంసలాపురం సమీపంలోకి రాగానే రోడ్డు పై ఉన్న బురద లో ప్రమాదవశాత్తు జారీ పడ్డారు. దీంతో వారికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వారిని వెంటనే నగరంలోని ఓఆసుపత్రికి తరలించారు. కాగా వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈరోడ్డులో సోమవారం రాత్రి నుంచి చాలా ప్రమాదాలు జరిగాయని, వెంటనే రోడ్డు పై ఉన్న బురదను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మునిసిపల్ జవాన్ తొలగింపు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 3: వరద సహాయక చర్యలకు సహాయంగా వచ్చిన వారికి సహకరించలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన 29వ డివిజన్ జవాన్ బొట్టు శ్రీనివాస్‌ను కమిషనర్ అభిషేక్ అగస్త్య విధుల నుంచి తొలగించారు. బాధితుల నివాసాలకు వెళ్లిన సర్వే బందాలకు సహకరించలేదని, పలు కారణాలతో జవాన్‌ను విధుల నుంచి తొలగించారు. ఎవ్వరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

వరద నష్టంపై పూర్తిస్థాయిలో సర్వే

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఖమ్మం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా వరదల్లో నష్టపోయిన ప్రజలను అన్ని విధాల ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు మున్నేరు రిటెనింగ్‌వాల్స్ ఎత్తు పెంపుపై నిపుణుల కమిటీతో చర్చిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్నేరు వరద నివారణను దృష్టిలోపెట్టుకుని మున్నేరు రిటెనింగ్‌వాల్స్‌కు టెండర్లు వేయడం జరిగిందని గుర్తుచేశారు. ఖమ్మంలో సోమవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం.. రాత్రి నగరంలోని మంత్రి పొంగులేటి నివాసంలో బస చేసిన విషయం విదితమే. మంగళవారం ఉదయం మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వెళ్లే ముందు ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

రాష్ట్రంలో భారీవర్షాలు, పలు చెరువులకు గండి పడడం, మున్నేరు ఉప్పొంగడంతో భారీగా నష్టం జరిగిందని, రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని ప్రధాని నరేంద్రమోదీ వచ్చి చూడకపోయినా ప్రభుత్వం తరుపున వెళ్లి కేంద్రం దృష్టికి వరద నష్టాన్ని తీసుకెళ్తామని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా గొలుసుకట్టు చెరువులను పూర్వం నిర్మిస్తే వాటిని ఆక్రమించుకుని నీటి ప్రవాహానికి ప్రకృతి సహజసిద్ధానికి విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం నీరు వెళ్లకుండా అడ్డుకోవడంతో వరద సమస్యలు తలెత్తుతున్నాయని కొత్త చెరువులు నిర్మాణం ప్రస్తుతం సాధ్యం కాదని ఉన్న చెరువుల ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వం చూస్తుందన్నారు. పాత చెరువులను ఆక్రమించుకుంటే సహించేది లేదన్నారు. అవసరాన్ని బట్టి ఆ జిల్లాల్లో చెరువుల ఆక్రమణపై హైడ్రాతరహాలో చర్యలు తీసుకుంటుందన్నారు.

మిషన్‌కాకతీయ పేరుతో గత ప్రభుత్వం మట్టిని దోచుకునేందుకు అమ్ముకునేందుకు నాణ్యత లేకుండా చెరువులు నిర్మించిందని, ఇది కమిషన్ కాకతీయ అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిబంధనలు పట్టించుకోకుం డా చెరువుల మట్టి తవ్వకాలు, నాణ్యతా లోపాలతో మిషన్ కాతీకతీయ చెరువలు తెగిపోయాయని ఆరోపించారు. బలోపేతం చేస్తే చెరువులు ఎందుకు తెగుతాయని, మాజీమంత్రి హరీష్‌రావు సమాధానం చెప్పాలన్నారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మమతా మెడికల్ కాలేజీలోఆక్రమించుకున్న భూములను మాజీమంత్రి హరీష్‌రావు దగ్గరుండి తొలిగించి ఆదర్శంగా నిలవాలని, ఇందుకు హరీష్‌రావుకు సవాల్ విసురుతున్నా, ఆక్రమనలపై నిజనిర్ధారణ కమిటీకి సిద్ధమేనా అని పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లాకు చెందిన భూములపై అవగాహన ఉన్న వారితో నిజనిర్ధారణ కమిటీ నియమిస్తా, వారితో ఆక్రమణలపై చర్చించేందుకు హరీష్‌రావు రావాలని, మెడికల్ కాలేజీలో ఆక్రమణలు తొలిగించి హరీష్‌రావు ఆదర్శంగా నిలబడాలని పేర్కొన్నారు. ఇందుకు హరీష్‌రావు ఇవ్వాల వస్తాడో రేపు వస్తాడో రావాలని, ఖమ్మంజిల్లా యువకులు కూడా చైతన్యంతో పువ్వాడ అజయ్‌కుమార్ ఆక్రమించుకున్న భూములపై హరీష్‌రావును అడగాలని సూచించారు. హరీష్‌రావు ఆనాడు నీటిపారుదల శాఖమంత్రిగా పని చేసినప్పుడే కదా ఈ ఆక్రమణలు జరిగాయి.. ఆక్రమించుకున్న భూములు స్వచ్ఛందంగా తొలగించి ఆదర్శంగా నిలవాలన్నారు. మీరు ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు సమాధానం చెబుతారన్నారు.

తెలంగాణలో వర్షాలు కురిసినా, తక్కువ ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్థానికంగా ఉండి ఎలా సహాయ చర్యల్లో పాల్గొన్నా రో తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవతలి ముఖ్యమంత్రి అద్భుతంగా చేస్తున్నారని హరీష్‌రావు చెబుతున్నారని.. వాళ్లు చేసిన మంచి పని కనిపిస్తుంది.. కాని ఇక్కడ మంత్రులు చేసిన పని కలిపించలేదా? అని ప్రశ్నించారు.

కేసీఆర్‌కు ఖమ్మం జిల్లాకు సంబంధం లేదు, వారిని దొంగల ముఠాగా భావించి ఖమ్మం జిల్లా ప్రజలు దూరంగా ఉంచారు. 2014, 2018, 2023లో కాంగ్రెస్ 9సీట్లు గెలిచింది, కేసీఆర్‌కు ఒక్కసీటు మాత్రమే ఇచ్చారని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. హెలికాప్టర్‌లో హైదరాబాదు నుంచి రావడానికి సమయాభావంతో పాటు వాతావరణం అనుకూలించని పరిస్థితి ఉందని అందుకే కేంద్రంతో మాట్లాడి రెండు హెలికాప్టర్లు విజయవాడల్లో ఉంచామని, ఖమ్మానికి దగ్గరగా ఉంచడం జరిగిందని, తద్వారా వాతావరణం ఆదారంగా సహాయక చర్యలు చేపట్టవచ్చని ఏర్పాటు చేశామని తెలిపారు.

అన్ని విధాల సహాయం అందిస్తాం...

ఖమ్మం జిల్లాకు అన్ని విధాలసహాయం అందిస్తామని, వరద తగ్గగానే ఇంటింటి సర్వేనిర్వహిస్తామని, తక్షణ సహాయంగా బియ్యం, నిత్యావసర వస్తువులు కుటుంబానికి రూ.10వేలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం రోడ్లపై బురద తొలిగిస్తున్నామని, రాష్ట్రస్థాయి అధికారులను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని అధికారులను ఖమ్మానికి రప్పించామని, రాష్ట్రంలో నాలుగు జిల్లాల కలెక్టర్లకు రూ.5కోట్లు సత్వరసహాయం అందించేందుకు నిధులు కేటాయించామని తెలిపారు. చిట్‌చాట్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోవడం అభినందనీయం

▸ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
▸ మంత్రికి రూ.3లక్షల చెక్కును అందజేసిన కార్పొరేటర్ పాలేపు విజయవెంకటమరణ



మంత్రి తుమ్మలకు చెక్కును అందిస్తున్న కార్పొరేటర్ విజయవెంకటరమణ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 3: ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా ఉండేందుకు ముందుకు రావడం ఆదర్శనీయమని ఖమ్మం 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ దంపతులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. మంగళవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వర్షం, వరద బాధితులను ఆదుకునేందుకు కార్పొరేటర్ విజయవెంకటరమణ మంత్రికి రూ.మూడు లక్షల చెక్కును అందించారు. మేయర్ పునకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ అసోసియేషన్ రూ.10 లక్షల విరాళం

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు3: వరద బాధితులను ఆదుకునేందుకు గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ రూ. 10లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ కోశాధికారి దొడ్డ రాకేష్, సంయుక్త కార్యదర్శి పి. వాసు, ఆకుల నాగేశ్వరరావు, ఎస్‌కే రియాజ్, బానోత్ ప్రతాప్ పాల్గొన్నారు.



మంత్రి తుమ్మల సమక్షంలో కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న స్లాబ్ గ్రానైట్ అసోసియేషన్ నాయకులు

బోనకల్, సెప్టెంబరు 3: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన భాగం నాగేశ్వరరావు దంపతులు తండ్రి, సోదరి నాయుడు, విమలల జ్ఞాపకార్థం సీఎం సహాయ నిధికి పది వేల నగదును ఖమ్మంలో మంగళవారం మంత్రి పొంగులేటి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రైతు నాగేశ్వరరావును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అభినందించారు.

అధైర్యపడకండి అండగా ఉంటా..

▸ మోతీలాల్ కుటుంబానికి సీఎం పరామర్శ



మృతుడు మోతీలాల్ సతిమణిని పరామర్శిస్తున్న సీఎం

కారేపల్లి, సెప్టెంబరు3: మండలం పరిధిలోని గంగారాంతండాలో ఆదివారం తెల్లవారుజామున కారుతోపాటు అకేరువాగులో గల్లంతై మృతిచెందిన నూనావత్ మోతీలాల్, అతడి కుమార్తె యువ శాస్త్రవేత అశ్విని కుటుంబాన్ని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. ముందుగా మృతుల కుటుంబాల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మోతీలాల్ సతీమణిని పరామర్శిస్తూ 'అధైర్యపడకండి.. మీకుటుంబానికి అండగా ఉంటా.. మీ కుమారుడు అశోక్‌కుమార్‌కు గ్రూపు-1ఉద్యోగం కల్పిస్తాం.' అని ప్రకటించారు. అనంతరం తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు, ఎక్స్‌గ్రేషయా కింద ఒక్కొక్కరికి రూ.ఐదులక్షల రూపాయలను అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దశదిన కార్యక్రమాల అనంతరం వైరా ఎమ్మెల్యే రాందాస్ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో తనను కలవాలన్నారు. ఈకార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, రాష్ట్ర సలహదారు వేంనరేందర్‌రెడ్డి, వైరా, ఇల్లెందు, డోర్నకల్ ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య, జాటోత్ రాంచందర్‌నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, కాంగ్రెస్ రాష్ట్రనాయకులు బొర్ర రాజశేఖర్, రాష్ట్ర మహిళ నాయకురాలు పగడాల మంజుల, బాణోత్ రాంమూర్తి, దుగ్గినేని శ్రీనివాస్‌రావు, నర్సింగ్‌శ్రీనివాస్‌రావు, మెదరి టోని, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్, పప్పుల నిర్మల, చాందిని, నాగవేణి తదితరులున్నారు.

కాగా పంటలు నష్టపోయినవారికి పరిహారం చెల్లించాలని సీపీఎం, సీపీఐ(ఎంఎల్) నాయకులు సీఎంకు వినతిపత్రం అందించే ప్రయత్నం చేశారు. తిరుగు ప్రయాణంలో వారి వద్ద నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వినతిపత్రం తీసుకున్నారు.

ఇరువర్గాల ఫిర్యాదులపై కేసు నమోదు



సీపీకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖమ్మం క్రైం, సెప్టెంబరు3: గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారని ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వరద బాధితులకు నిత్యవసర సరుకులు అందిస్తుండగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు మధ్య జరిగిన ఘర్షణలో గుర్తు తెలియని వ్యక్తులు కార్ల పై రాళ్లు రువ్వారని సంగారెడ్డి జిల్లాకు చెందిన సంతోష్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసరడంతో తలకు గాయమైందని నగరానికి చెందిన యాకుబ్ బాబా ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సహాయక చర్యల్లో వేగం పెంచండి

▸ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, సెప్టెంబరు3: వరద సహాయక చర్యల్లో వేగం పెంచి బాధితులకు అండగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని వాల్యాతండా, కస్నాతండా, తనగంపాడు, తదితర వరద ముంపు ప్రాంతాల్లో మంగళవారం మంత్రి పొంగులేటి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండాలని బాధితులను ఓదార్చారు. ఇంటింటికి తిరిగి నష్టాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వాల్యాతండా వద్ద ఆకేరు వాగుపై కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. వంతెన పునరుద్దరణకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధికారులు నష్టం అంచనాలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, ఏడీఏ సరిత, తహసీల్దార్ రాంప్రసాద్, నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, బండి జగదీష్, వెంకటరెడ్డి, బాబు, పాపానాయక్, తదితరులున్నారు.

మండలంలోని కస్నాతండా, వాల్యాతండా తదితర గ్రామాల్లో ఎంపీ రఘురాం రెడ్డి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వరద బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరుపున అందజేస్తున్న నిత్యావసర వస్తువులు బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ బ్రహ్మయ్య, చంద్రశేఖర్, పాపానాయక్, ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, సెప్టెంబరు3: బాధిత కుటుంబాలకు అండగా ఉండి ఆదుకుంటామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. రాకాసితండా వాసులకు కోరుకున్న చోట ఇళ్లు కట్టించి నిర్మిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మహిళా కార్పొరేషన్ చైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి, జేసీ చంద్రమోహన్, ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, ఏవో సీతారాంరెడ్డి, నాయకులు చావా శివరామకృష్ణ, నూక నరేష్‌రెడ్డి, యన్నం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీఈ బోడ మంగిలాల్, ముదిరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేరుకుంటున్న వరద బాధితులు

▸ అడుగడుగునా మొహరించిన యంత్రాంగం
▸ రంగంలోకి 13 మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఉద్యోగులు
▸ డివిజన్లు వారీగా బాధ్యతలు అప్పగింత




బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 3: మున్నేరు వరద ఉధ్రుతిలో అతలాకుతలమైన బాధిత కుటుంబాలు ఇప్పుడిప్పుడే కొంతమేర తేరుకుంటున్నాయి. వరద తగ్గుముకం పట్టడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం బాధితులను ఆదుకునేందుకు సన్నద్ధమై సహాయక చర్యలను మంగళవారం నుంచి ప్రారంభించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో జిల్లా స్థాయిలోని అధికారులతో ఆయా శాఖల జిల్లా స్థాయి కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు కేఎంసీలో బాధ్యతలు కేటాయించారు. వీరితో పాటుగా 13 మండలాల్లో పని చేస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సెర్ప్, డ్వామా అధికారులు నుంచి గ్రామ స్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శల వరకు ఖమ్మం నగరంలోని కార్పొరేషనలో డివిజన్ల బాట పట్టారు. అడగడుగున మోహరించి రెవెన్యూ సిబ్బంది సమగ్ర సర్వే చేస్తుండగా, ఇతరశాఖల అధికారులు, ఉద్యోగులు వారికి కేటాయించిన పారిశుధ్య, తాగునీరు, సేవా కార్యక్రమాలు చేపట్టారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థవిక్రమ్‌సింగ్, ఐటీడీఏ పీవో, శిక్షణా కలెక్టర్, బృందాలుగా ఏర్పడి డివిజన్లలో బాధితులకు కావాల్సిన ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్నారు. బొక్కలగడ్డ, జలగంనగర్, వెంకటేశ్వరనగర్‌లో బాధితుల ఇళ్లలోకి కలెక్టర్ వెళ్లి వారి గోడు తెలుసుకున్నారు.

రెవెన్యూశాఖ నుంచి అసిస్టెంట్ కలెక్టర్ నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు కేఎంసీలో ఇంటింటి సర్వే చేపట్టారు. 13 మండలాల ఎంపీడీవోలకు ప్రాంతాల వారీగా డివిజన్లు కేటాయించారు. జిల్లా స్థాయిలో పని చేస్తున్న 12 మంది జిల్లా అధికారులకు ముఖ్యమైన పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు తమ వేతనాల నుంచి విరాళాలు సేకరించి కేఎంసీలో బాధితులకు సహాయం అందిస్తూ, జిల్లా అధికారులు కేటాయించిన బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

● భద్రాచలం వద్ద 41.2 అడుగులు



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

భద్రాచలం, సెప్టెంబరు 3: ఎగువన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు 25.7 అడుగులున్న గోదావరి నీటిమట్టం కొద్దిసేపు నిలకడగా ఉంది. ఆ తరువాత క్రమేపీ పెరుగుతూ మంగళవారం ఉదయం 6 గంటలకు 27.5 అడుగులకు చేరుకుంది. ఈ క్రమంలో సాయంత్రం 5 గంటలకు 38.5 అడుగులకు పెరిగింది. రాత్రి 12గంటలకు 41.2 అడుగులకు చేరుకుంది. ఇది మరింతగా పెరిగి తొలి ప్రమాద హెచ్చరిక(43అడుగులు)కు చేరుకోనున్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. గోదావరి నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో వరద సాయం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో 9392919743, భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో 7995268352, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 7981219425, 08743-232444 లకు ఫోను చేసి వరద సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

(5వ పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డివి అన్నీ డాంభికాలని, మోకాలుకు బోడిగుండుకు ముడిపెడతారని దుయ్యబట్టారు. ఖమ్మం, మహబూబాబాద్‌లలో వరద ప్రాంతాల్లో పర్యటించిన సీఎం... బాధిత కుటుంబాలకు కేవలం రూ.10వేలు అందజేస్తామని ప్రకటించటం సిగ్గుచేటన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు వరద సహాయ చర్యల్లో విఫలం కావటంతో ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి సమీక్షలు చేసినా, ఆ సమీక్షల్లో ప్రతిపక్షాలను తిట్టడం తప్ప సహాయ చర్యలపై ఏం నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు.

ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన తమపై పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ గూండాలు దాడిచేసి, వాహనాల అద్దాలను ధ్వంసం చేయటం సిగ్గుచేటన్నారు. ఈ విషయమై సీపీ సునీల్‌దత్‌కు ఫిర్యాదు చేసామని హరీష్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం వరద బాధితులకు సాయం చేయకపోయినా, బీఆర్‌ఎస్ మాజీప్రతినిధులు సాయం చేస్తున్నారని, దానిని తట్టుకోలేక తమపై దాడులకు దిగుతున్నారన్నారు.

వరదముంపు బాధితులకు తాగునీరు సైతం అందించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆరోపించారు. వరదల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు, ఇళ్లు కోల్పోయిన వారికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు, వరదల్లో సర్వస్వం కోల్పోయిన వారికి తక్షణ సహాయం కింద రూ.2 లక్షలు, పంటనష్టం కింద ఎకరానికి రూ.30 వేలు, పొలంలో ఇసుకమేట వేస్తే ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాజీమంత్రులు జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ వరదబాధితుల బాధలు, కష్టాలను తెలుసుకునేందుకు వచ్చిన తమపై దాడిచేయటం సిగ్గుచేటన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేక్‌గౌడ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బాణోత్ మదన్‌లాల్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పరామర్శ

మున్నేరు వరద బాధితులను బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం పరామర్శించి. నిత్యావసరాలు అందచేశారు. మాజీమంత్రులు తన్నీరు హరీష్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, జగదీశ్వర్‌రెడ్డి. సబితా ఇంద్రారెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావులు కరుణగిరి ఎదురుగా వేంకటేశ్వరనగర్, జూబ్లీక్లబ్ వెనుకప్రాంతం,బొక్కలగడ్డ తదితర ప్రాంతాల్లో కాలినడకన పర్యటించి, బాధితులతో మాట్లాడారు. సర్వం పోగొట్టుకొని, కట్టుబట్టలతో మిగిలామని, ఇళ్లలోకి బురద చేరటంతో దుర్భర పరిస్థితుల్లో ఉన్నామని బాధితులు బీఆర్‌ఎస్ నేతలకు చెప్పారు. కాగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సమకూర్చిన నిత్యావసరాల సంచులను బాధితులకు అందచేశారు. సిద్ధిపేటనుండి నాలుగు వాహనాల్లో నిత్యావసర వస్తువులను మున్నేరు వరద బాధితులకు పంపుతామనని హరీష్‌రావు తెలిపారు.

సహాయక చర్యలు జరుగుతూనే ఉన్నాయి: పాయం

మణుగూరు సెప్టెంబర్ 3: వరద ప్రభావిత ప్రాంతాల్లో మునిసిపాలిటీ తరుపున పారిశుధ్య పనులు జరుగుతూనే ఉన్నాయి.. ఏదో చేయాలని రాజకీయం చేసి బురద జల్లే పనులకు కొందరు పూనుకుంటున్నారు, ఇది సమయం కాదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాళీమాత ఏరియాల్లో, ఎక్స్ లెంట్ స్కూల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక మహిళలతో మాట్లాడారు. వరద ముంపు ప్రాంతాల్లో కాలువలు శుభ్రం చేయడం, వీధిలైట్లు లేని చోట్ల లైట్ల ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ అన్ని ఏరియాల్లో చల్లించడం జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. వరదలు ముంచెత్తడానికి గతంలో వాళ్లు చేసిన పొరపాట్లే నని అన్నారు. మణుగూరును వరదలు చుట్టుముడితే అధికారులు అర్ధరాత్రి సహాయక చర్యలు చేపట్టారని మంచినీటి వసతి కూడా ట్యాంకర్ల ద్వారా అందించడం జరగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

భార్యను అనుమానించి హత్య

పాల్వంచ, సెప్టెంబరు 3: భార్యను అనుమానించి హత్య చేసిన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ మండలం సంగం గ్రామానికి చెందిన కాయిత రాధ (31)ను తొమ్మిది సంవత్సరాల క్రితం మంచిర్యాల జిల్లాకు చెందిన కాయిత రాముకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. పెళ్లయిన మూడు నెలల నుంచే రాము అతని భార్యను అనుమానించి శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. ఈ క్రమంలోనే గత నెల 30న భర్త పెట్టే బాధలు భరించలేక రాధ తన ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చింది. భార్యను ఎలాగైనా హతమార్చాలని పథకం పన్నిన రాము సోమవారం అత్తారింటికి వచ్చాడు. వెనుక గదిలో అందరూ నిద్రించిన తరువాత రాధ ముఖంపై తలదిండుతో అదిమిపట్టుకుని గొంతు నులిమి హత్య చేసాడు. అలికిడికి నిద్ర లేచిన బావమరిది ధనుగురి ప్రసాద్ బావ పారిపోతుండటాన్ని గమనించి అనుమానంతో తన అక్క గదిలో చూడగా ఆమె మరణించి ఉండటాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ నిర్వహించి మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు రాధ సోదరుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 3: పురుగుల మందు తాగి వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రేగళ్ల గ్రామపంచాయతీలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. భూక్య జ్యోతి (28) సోమవారం సాయంత్రం పురుగు మందు తాగి ఇంటి వద్దనే మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. రేగళ్ల గ్రామానికి చెందిన భూక్య అరుణ్‌కుమార్‌తో గత ఏడాది జ్యోతితో వివాహం జరిగింది. ఈ ఏడాది కాలంలోనే పలుసార్లు భార్య భర్తలు, కుటుంబ సభ్యులతో గొడవలు చోటుచేసుకున్నాయి. అదనంగా వరకట్నం కావాలంటూ జ్యోతిని భర్తతోపాటు అత్త, మామలు ఇబ్బందులు పెడుతుండటంతో వేధింపులు తాళలేక అదే గ్రామంలోని తన తల్లి ఇంటికి వెళ్లి సోమవారం పురుగు మందు తాగి మృతి చెందింది. ఈ విషయాన్ని జ్యోతి తల్లిదండ్రులు లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి జ్యోతి భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ప్రధాన అర్చకుడికి అస్వస్థత

భద్రాచలం, సెప్టెంబరు 3: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాధాచార్యులు అస్వస్థతకు గురై భద్రాచలంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం, సెప్టెంబరు 3: మండల పరిధి డబ్బురేగుబల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒక ఆటోడ్రైవరు తీవ్రంగా గాయపడ్డాడు. లక్ష్మీనగరానికి చెందిన కటుకూరి చంద్రమౌళి భద్రాచలం వైపు నుంచి లక్ష్మీనగరం వస్తోండగా, గంగోలుకు చెందిన దేగల సందీప్ భద్రాచలం వైపు వెళ్తున్నాడు. రహదారి ప్రక్కగా ఉన్న ట్రాక్టరును తప్పించే క్రమంలో ప్రమాదం జరిగింది. సందీప్ ఆటో నుజ్జవగా, మౌళి ఆటో సైతం ధ్వంసమైంది. సందీప్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా, 108 వాహనంలో భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ గణేష్ సందర్శించారు.

57 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

చుంచుపల్లి, సెప్టెంబరు 3: అక్రమంగా మూడు వాహనాల్లో 57 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పోలీసులకు చిక్కిన సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. కొత్తగూడెం టు టౌన్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా స్టేషన్ పరిధిలోని రామవరం ఏరియాలో గల నెహరూబస్తీలో పీడీఎస్ రైస్ అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రామవరంలో నెహ్రూబస్తీకి చెందిన ఎస్‌కె.యాకూబ్‌పాషా ఇంటి వద్ద ఏన్కూరు మండలంలోని కేసుపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు పగడాల నరేష్, సిద్దల కాంతారావు, జెర్రిపోతుల హరీష్, మందనపు ఆదర్శ్ కేలోతు సక్రియను అదుపులోకి తీసుకున్నారు. రామవరానికి చెందిన ఎస్‌కె. యాకూబ్ పాషాలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు పిక్ అప్ వాహనాలు, ఒక కారును స్వాధీన పరుచుకున్నారు. ఈ వాహనాల్లో 57 క్వింటాళ్ల బరువు గల 114 పీడీఎస్ బియ్యం బ్యాగులను స్వాధీనపరచుకున్నారు. వీటి మార్కెట్ విలువ సుమారుగా రూ.1.48 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. ఆరుగురు నింధితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కొత్తగూడెం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

అశ్వాపురం, సెప్టెంబరు 3: మండల పరిధిలోని గొందిగూడెం ఇటుకబట్టీల సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఇటుకబట్టీల వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు మంగళవారం సిబ్బందితో దాడి చేసి వారిని పట్టుకుని, వారి నుంచి రూ.3వేలు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.

‘ముంపు వాసులు అప్రమత్తంగా ఉండాలి’

భద్రాచలం సెప్టెంబర్ 3: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ తొలి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుతున్న క్రమంలో వర్షాలు వస్తే ముంపునకు గురయ్యే కాలనీలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ శంక్వార్ తెలిపారు. మంగళవారం భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీ, అశోక్‌నగర్ కొత్తకాలనీలో ఆయన పర్యటించి, భారీ వర్షాలు కురిస్తే ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, కాలనీలోకి వర్షపు నీరు చేరిన వెంటనే సంబంధిత అధికారులకు సమచారం అందించాలని ఆయన అన్నారు. గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోందని, కావున ఎవరూ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే డయల్ 100 కు గాని లేదా 8712682106 నంబర్‌కు కాల్ చేయాలని కాలనీ వాసులకు ఏఎస్పీ అవగాహన కల్పించారు. అనంతరం కరకట్ట వద్ద ఉన్న విస్తా కాంప్లెక్స్‌తో పాటు గోదావరి స్నాన ఘట్టాలను ఆయన పరిశీలించి, గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు.

పథకాలు ఎత్తివేసే కుట్రను తిప్పికొట్టండి

భద్రాచలం, సెప్టెంబరు 3: రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేస్తున్న పథకాలను ఇన్సూరెన్సు కంపెనీలకు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్వహించిన టెండర్లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయు కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడారు.

పీహెచ్‌సీలలో డేటా అప్‌డేట్ చేయాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 3: భద్రాద్రి జిల్లాలో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో(పీహెచ్‌సి) డేటాను అప్‌డేట్ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ మంగళవారం సూచించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సిల సీనియర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆరోగ్య సిబ్బందికి అన్ని రాయతీలు సకాలంలో అందజేయాలన్నారు.

పేరంటాల చెరువు తూముకు గండి

వృథాగా పోతున్న నీరు.. పంటల సాగు ప్రశ్నార్థకమే..



చెరువు తూము వద్ద పడ్డ గండి

మణుగూరురూరల్, సెప్టెంబరు 3: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి సాంబాయిగూడెం గ్రామంలోని పేరంటాల చెరువు నీటిని సంవృద్ధిగా నింపుకుంది. అలుగు పొంగి పొర్లిపారింది. ఈ క్రమంలో సామర్థ్యానికి మించి వరద నీరు చెరువుకు చేరుకోవడంతో తూముకు గండి పడింది. దీంతో పెద్ద ఎత్తున చెరువులో నీరు వృథాగా పోతోంది. దీన్ని అరికట్టేందుకు రైతులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వగా సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు కింద సుమారు 1500 ఎకరాల భూమి ఉంది ఈ భూమిలో వరి, పత్తి, మిరప సాగు చేస్తుంటారు. ఈ భూములన్ని పేరంటాల చెరువు నీటిపైనే ఆదారపడి సాగు అవుతుంటాయి. గండిపడి పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతుండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

వరద బాధితులను ఆదుకోవాలి

రోడ్డుపై ఆందోళన చేసిన మాజీ ఎమ్మెల్యే రేగా

మణుగూరు సెప్టెంబరు 3: వరద బాధితులకు ఆదుకోవాలని, ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పట్టణ ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. దీంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి దీక్ష విరమించే ప్రయత్నం చేసిన వారు భీష్మించే సరికి మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ మేడ ప్రసాద్ తదితరులు మాజీ ఎమ్మెల్యేను బలవంతంగా వాహనం ఎక్కించి స్టేషన్‌కు తలించారు. ఈ క్రమంలో పోలీసుల దౌర్జన్యం నశించాలి అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. తర్వాత ఆందోళన చేస్తున్న వారి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రేగా

ఎమ్మెల్యే దత్తపాఠశాలగా ‘పార్కలగండి’

రూ.20లక్షలు మంజూరు చేసిన జారే

దమ్మపేట, సెప్టెంబరు 3: పార్కలగండి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను దత్తత తీసుకొంటున్నట్లు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రకటించారు. ఎమ్మెల్యే ఆదినారాయణ మంగళవారం ఆ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కలగండి ఆశ్రమ పాఠశాల ఆదర్శ పాఠశాలగా ఉండాలని, పాఠశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నిధుల నుంచి 20లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో పాఠశాలలో డిజిటల్ ల్యాబ్, కంప్యూటర్లు, మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. పార్కలగండి పాఠశాలను స్పోర్ట్స్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంచి ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఉపాధ్యాయులు, విద్యార్థులు సహకరించాలని కోరారు. రాష్ట్రస్థాయిలోనే ఆదర్శ పాఠశాలగా పార్కలగండి పాఠశాలకు గర్తింపు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పాఠశాలలో వున్న సమస్యలు పరిష్కరించాల్సిందిగా హెచ్ఎం రవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం అంకంపాలెం గిరిజన బాలికల గురుకుల కళాశాలను, పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ తెలిపారు. వైద్య సిబ్బంది అందుబాటులో వుండాలని ఆదేశించారు. అనారోగ్యంతో వున్న పార్కలగండి మాజీ సర్పంచ్ కోర్సా సాగర్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యువో చంద్రమోహన్, అచ్యుతరావు, వాసం శ్రీను, రెడ్డిమళ్ళ చిట్టినా యన, వాడే వెంకట్రావు, పర్వతనేని ప్రసాదు, చిన్నశెట్టి యుగందర్, రావు గంగాధరరావు, గోపిశాస్త్రి పాల్గొన్నారు.

రింగ్‌బండ పనులను పూర్తిచేయండి

అశ్వారావుపేట రూరల్: వాతావరణం అనుకూలించగానే పెదవాగుప్రాజెక్టు రింగుబండ పనులను పూర్తిచేసి ఆయకట్టు రైతులకు నీరందించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. మండలంలోని పెదవాగుప్రాజెక్టు రింగ్‌బండ వర్షానికి కొట్టుకుపోయిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పెదవాగు ప్రాజెక్టును సందర్శించారు. వర్షానికి కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు.

డిగ్రీ కళాశాల సందర్శన

అశ్వారావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సందర్శించారు. కళాశాలలో కనీస సౌకర్యాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అయితే కళాశాలలో పలు సమస్యలు ఉన్నాయని తెలపగా వెంటనే మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేసి పంపితే నిధుల మంజూరుకు కృషిచేస్తానని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు.

మణుగూరులో పర్యటించిన హెల్త్ డైరెక్టర్

మణుగూరు సెప్టెంబరు 3: మణుగూరు మండలంలో గత మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా వరదముంపుకు గురైన ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ పర్యటించారు. సుందరయ్యానగర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మెడికల్ క్యాంపులను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్, డీఐవో బాలాజీ నాయక్, మణుగూరు ఆసుపత్రి వైద్యులు శివకుమార్, నిశాంత్‌రావు, సూపరింటెండెంట్ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యం ముందు తరాలకు ఆదర్శం

గ్రంథం ఆవిష్కరణలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 3: సాహిత్యం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని, దీంతోపాటు నైపుణ్యం కూడ ఉంటే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఆనందఖనిలోని టీచర్స్ ట్రైనింగ్ సెంటరులో తెలంగాణ సాహిత్య పరిషత్ హైదరాబాద్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర స్వరూప గ్రంధాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చరిత్రను గ్రంథస్తం చేసి భావితరాలకు అందించడం శుభదాయకమని, జిల్లాలో ఎంతో సాహిత్యం, చరిత్ర ఉందని దానిని విద్యార్థులకు, ఉపాధ్యాయులే అందించాలని, సాహిత్యం ద్వారా విద్యార్థుల్లో మంచి నైపుణ్యాలు పెంపొందించుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జుర్రు చెన్నయ్య, జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్, డీఈవో ఎం.వెంకటేశ్వరచారి, కోర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సిద్దాంతపు ప్రభాకారాచర్యులు, సభ్యులు కసుప వెంకటరమణ, ఆంగోతు జయవాసు, తాతోలు దుర్గాచారి, సీర హరి ప్రసాద్, రచయితలు కోమాకుల సీతారాములు, సరస్వతి చలపతిరాజు, జోగం తారక్, జి.నర్సింహారావు, కేవీ రమణ, శ్రీపాద శ్రీధర్, నవభారత్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైయిన్లను అక్రమిస్తే చర్యలు తప్పవు

కరకగూడెం, సెప్టెంబర్ 3: మండలంలో వ్యాపారస్తులు, గ్రామస్థులు ఎవరైన డ్రైయినేజీలను అక్రమిస్తే చర్యలు తప్పవని కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో తహసీల్దార్ నాగ ప్రసాద్ డ్రైయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులతో మాట్లాడారు. డ్రెయిన్లను ఆక్రమించడం వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో డ్రెయిన్ల ఆక్రమణను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని తహసీల్దార్ తేల్చిచెప్పారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

కరకగూడెం, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని ఎస్సీ వాడకు చెందిన సందా సాంబయ్య(40) అనే వ్యక్తి మద్యానికి బానిసై ఆరోగ్యం క్షీణించి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. మంగళవారం ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కరకగూడెం గ్రామానికి చెందిన సాంబయ్య అనే వ్యక్తి చాలా రోజులుగా తాగుడుకు బానిసై ఆరోగ్యం క్షీణించి ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మంగళవారం మృతుడు భార్య సందా సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

కార్మికుల సొమ్ము దోచి పెడతారా..?

కొత్తగూడెం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను టెండర్ల ద్వారా బీమా కంపెనీలకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి సంక్షేమ బోర్డులో నిధులను ప్రైవేట్ ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని ఈ టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేయడంలో భాగంగానే వెల్ఫేర్ బోర్డును ప్రైవేట్‌పరం చేసే కుట్ర జరుగుతుందని విమర్శించింది. కేంద్రంలో బీజేపీ చేస్తున్న నిర్ణయాలను రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు చేయడం కోసం తహతహలాడుతుందని విమర్శించారు. ప్రమాద బీమా రూ.10లక్షలకు పెంచాలని, సహజ మరణం పరిహారాన్ని రూ.5లక్షలకు పెంచాలని, వివాహ, ప్రసూతి కానుకలను లక్ష రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఏసీఎల్ షరుద్దీన్, మణుగురు ఎఎల్‌వో నాగరాజు ధర్నా వద్దకు వచ్చిన వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏసీఎల్ మాట్లాడుతు డిమాండ్లన్నింటిని రాష్ట్ర కార్మికశాఖ అధికారులకు తెలియచేస్తామని పేర్కొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

చార్ట్ ప్రకారం పనులు చేయాలి: కూనంనేని



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 3: వార్డుల వారీగా చార్టును రూపొందించుకుని దాని ప్రకారం వార్డులో పారిశుధ్య పనులు, డ్రైనేజీల పూడిక, దోమల మందు పిచికారి వంటి పనులను నిర్వహించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. మంగళవారం ఇటీవల వర్షాల వల్ల గుట్ట వరద తాకిడికి దెబ్బతిన్న ప్రాంతమలైన హమాలీకాలనీ, ఇందిరాకాలనీలో విస్తృతంగా పర్యటించారు. ప్రజలు పలుసమస్యలను ఎమ్మెల్యేకు ఏ కరువు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల అలక్ష్యం వహిస్తే సహించనని అధికారులను హెచ్చరించారు. హమాలీకాలనీలో కొంతకాలం క్రితం వేసిని సీసీ రోడ్డు దెబ్బతినడాన్ని గమనించిన ఆయన ఈ రోడ్డు కాల పరిమితి ఎంతకాలం ఉండాలి.. నిబంధలన మేర లేనట్లైతే ఆ కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య పనులను వెంటనే చేపట్టడంతోపాటు దోమల నివారణకు ఫాగింగ్‌ను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి విశ్వనాథం, పట్టణ, మండల కార్యదర్శులు సాయిబాబు, పూర్ణచందర్‌రావు, తహసిల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ డాకునాయక్, ఎంపీడీవో విజయభాస్కర్ పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని ఎమ్మెల్యేకు వినతి

భద్రాచలం, సెప్టెంబరు 3: భద్రాచలంలోని జగదీష్ కాలనీలో సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావు మండల తహసీల్దారు, పంచాయతీ కార్యదర్శులకు ఫోను చేసి తక్షణమే సెల్‌టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. ప్రజల సమ్మతి లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని ఎమ్మెల్యే ఆదేశించారు.

కొండరెడ్ల కుటుంబాలకు మౌలిక వసతులు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 3: కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించటం జరుగుతుందని, ఇందుకు ప్రత్యేకంగా సమావేశాల నిర్వహరణ సాగుతుందని భద్రాచలం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజు అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామం సుద్దగోతులగూడెంలో మంగళవారం కొండరెడ్ల కోసం ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ హాజరయ్యారు. ఈసందర్భంగా కొండరెడ్లకు వివిధ రకాల ధృవీకరణ పత్రాలను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వారా ప్రతి కొండరెడ్ల గ్రామంలోనూ ఆధార్‌కార్డులు, కుల ధృవీకరణ పత్రాలు, పీఎం కిసాన్ క్రెడిట్ కార్డులు, బ్యాంకు ఖాతాల పుస్తకాలను అందించటం జరిగిందన్నారు.

దళ సభ్యులకు రివార్డులను అందచేసిన ఎస్పీ



చెక్కులు పొందిన వారితో ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): నిషేదిత సీపీఐ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక, మావోయిస్టు పార్టీ అగ్రనాయకుల వేధింపులు తట్టుకోలేక ఇటీవల కాలంలో జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన నిషేదిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు దళసభ్యులతోపాటు మరో ఏడుగురు మిలిషియా, కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాయలంలో చెక్కుల రూపంలో రివార్డు నగదును అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున అందవల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించి వారు మెరుగైన జీవితాన్ని గడిపేవిధంగా కృషి చేయడంలో జిల్లా పోలీస్‌శాఖ ఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన నిషేదిత సీపీఐ మావోయిస్టులు కేవలం తమ ఉనికి కోసమే అమాయకులైన ఆదివాసీ ప్రజలకు మాయమాటలు చెప్పి బలవంతంగా పార్టీలోకి చేర్చుకుని వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టి వేస్తున్నారని ఆరోపించారు. లొంగిపోయిన సాధారణ జీవితం గడపాలనుకునే మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు తమ బంధుమిత్రుల ద్వారా కానీ, దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో కానీ పోలీసు అధికారుల వద్ద కానీ నేరుగా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వర్, దుమ్ముగూడెం సీఐ అశోక్, ఎస్ఐ వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులకు అనుమతి తప్పని సరి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 3: గణేష్ నవరాత్రులకు పోలీస్ శాఖ అనుమతి తప్పని సరి కొత్తగూడెం త్రీ టౌన్ సీఐ శివప్రసాద్ మంగళవారం తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహణకు నవరాత్రులు ప్రశాంతంగా పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. గణేష్ ప్రతిమల ఎత్తు, నిమజ్జన తేదీ, ప్రతిమ ఏర్పాటు చేసే ప్రదేశం వంటి వివరాలను పోలీస్ ప్రోటో కాల్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు అనంతరం సంబంధిత స్థానిక పోలీసు అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలించి అనుమతులు జారీ చేస్తామని తెలిపారు. అదేవిధంగా మైకు, డీజే, విద్యుత్ అనుమతులు తీసుకొని ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. మండపాల ప్రాంతాలలో ఎటువంటి అవాంఛణీయ సంఘటనలూ జరుగకుండా కమిటీ బాధ్యతలు వహించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం చేసుకోవాలి

కొత్తగూడెం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని విధాల ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లతో పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నిలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బందికి విధుల కేటాయింపు వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్నికలకు కేటాయించిన సిబ్బందికి తగిన విధంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిందించుకోవాలని తెలిపారు. భారీ వర్షాలు, వరదలకు జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల విషయంలో స్థానికంగా పడిన గుంతలను పూడ్చాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని దీని విషయంలో స్థానికంగా పడిన గుంతలను పూడ్చాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులుచేపట్టాలని దీని విషయంలో పంచాయతీరాజ్ అధికారులు అంచనాలను రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్డీవో విద్యాచందన, సీపీవో శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ మహేందర్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పాల్వంచ మున్సిపల్ కమీషనర్ డాకుసింగ్, డీసీహెచ్ రవిబాబు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీపీవో చంద్రమౌళి పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 3: అశ్వారావుపేట నుంచి గాండ్లగూడెం వెళ్లే దారిలో అనంతారం, గాండ్లగూడెం గ్రామాల సమీపంలో దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలుగుదేశం నియోజకవర్గ నాయకులు కట్రం స్వామి అధికారులను కోరారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మంగళవారం నాయకులు పరిశీలించారు. జూలై 18వ తేదీన వచ్చిన వరదలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రమాదాలకు నిలయంగా మారినా అధికారులు కనీస మరమ్మతులు చేయకపోవటం దారుణమన్నారు.

టెండర్ల రద్దు కోరుతూ ధర్నా

దుమ్ముగూడెం, సెప్టెంబరు 3: కార్మికుల సంక్షేమ పథకాల అమలును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే టెండర్లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని సంఘం జిల్లా కోశాధికారి జిపద్మ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. తహసీల్దార్‌కు వినతిపత్రమందజేశారు. మండల కార్యదర్శి సుధాకర్, నారాయణ, రాంబాబు, ముత్యాలరావు, అర్జున్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు పాఠశాల ప్రారంభం

దుమ్ముగూడెం, సెప్టెంబరు 3: లక్ష్మీనగరం సీఎస్ఐ ప్రాథమిక పాఠశాల మంగళవారం ఎట్టకేలకు తెరుచుకుంది. కొన్నేళ్లుగా పాఠశాలను సక్రమంగా నిర్వహించకపోగా, ప్రస్తుత విద్యాసంవత్సరం ఆరంభం నుంచి పాఠశాల తెరుచుకోలేదు. దీంతో గ్రామస్థులు జిల్లా కలక్టర్‌ను కలిసి అభ్యర్థించగా, ఆయన ఆదేశాల మేరకు మండల పరిషత్ టీచర్‌ను డిప్యూటేషన్‌పై అక్కడ నియమించారు. కాగా సీఎస్ఐ సంస్థ ప్రతినిధి ఒకరు పాఠశాల రికార్డు గదికి మంగళవారం తాళం వేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఇల్లెందు టౌన్, సెప్టెంబర్ 3: భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న 4 లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.